# రాసమూర్తి సుద్దులు

రచన

## ఆచార్య రాణి సదాశివ మూర్తి

(కేంద్రసాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత)

ప్రకాశకులు

**శివ తరుణీ పబ్లికేషన్స్**

తిరుపతి

2020

# రాసమూర్తి సుద్దులు

రచన

**ఆచార్య రాణి సదాశివ మూర్తి**

కేంద్రసాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత

**ప్రకాశకులు**

**శివ తరుణీ పబ్లికేషన్స్**

తిరుపతి

2020

**రాసమూర్తి సుద్దులు**

రచన

**ఆచార్య రాణి సదాశివ మూర్తి**

కేంద్రసాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత


ప్రథమ ముద్రణ : 2020

ఈ–ప్రతి

వెల : 100/–



© రచయితవే



**ప్రకాశకులు**

**శివ తరుణీ పబ్లికేషన్స్**

'సుమేరు', 23–2–204, ప్లాట్ నెం : 17,
టి.టి.డి. ఫేజ్ – II ప్లాట్స్.
యం. ఆర్. పల్లి, తిరుపతి – 517502



**ఈమెయిల్, చరదూరవాణి :** ranisadasivamurty@gmail.com,
Ph. +919440246354

# నా నుడి

రాసమూర్తి సుద్దులు ఆన్ లైన్ ప్రతిగా తీసుకుని రావాలి. ఈ ఆగష్టు 15 కి ఆత్మీయుల చరవాణులనిది ఒక "ఈ–పుస్తకమై" అలంకరించాలి అని ఈ ఆగష్టు 13న కలిగిన సంకల్పం. వెంటనే మాకు ఆత్మీయులు, రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం మాన్య కులసచివులు మహామహోపాధ్యాయ ఆచార్య శ్రీ గుళ్ళపల్లి శ్రీరామ కృష్ణమూర్తి గార్ని అభిప్రాయం కోసం సవినయం అభ్యర్థించాను. వారు కేవలం ఇరువది నాలుగు గంటలకన్నా తక్కువ సమయంలో అభిప్రాయాన్ని అందించారు. ఇదీ వారికి నాపట్ల గల ఆదరణకు, ఆత్మీయతకు తార్కాణం. వారికి సప్రణతితతిశతం ధన్యవాదాలను అర్పించు కుంటున్నాను. అలాగే ఈ పుస్తకాన్ని ఇంతతక్కువ వ్యవధిలో ఇంత చక్కని ఆకృతిలో రావడానికి ముఖ్య కారకులు నా యిరువురు విద్యా పుత్రికలు డా. కె. సుజని, డా. సుజాత మునుకుట్ల. వీరిరువురిలో సుజని కవర్ పేజీ డిజైన్ తో సహా పుస్తకానికి ఒక ఆకృతిని ఇచ్చింది. ఇక సుజాత ఈ పుస్తకంలోని ప్రతి సుద్దుకు ఇంటర్నెట్ నుండి తగిన

బొమ్మని ఎంపిక చేసి జోడించింది. కనుక వీళ్ళిద్దరికీ నా పరిపూర్ణమైన ఆశీస్సులను అందజేస్తున్నాను. వీటిలోని వచనకవితలకు సుద్దులు అని పేరు పెట్టడానికి ఆచార్య శ్రీ గంగిశెట్టి లక్ష్మీనారాయణ వర్యుల ప్రోత్సాహం. ఎవరింట్లో పిల్లల ముద్దు పేర్లతో వారు తమ కవితలను వ్రాయండి అని ప్రోత్సహించారు. వారికి ప్రత్యేకంగానూ నా హృదయపూర్వక కృతజ్ఞతలను నివేదించుకుంటున్నాను. నా కుమారుడి పేరు "సుధాంశు". ముద్దుగా "సుద్దూ" అని పిలుస్తాము. అదే నేడు ఈ కవితా సంపుటిని "రాసమూర్తి సుద్దులు" అని వ్యవహరించడానికి కారణం. ఈ సుద్దులన్నీ "సాహితీ సిరికోన" సభ్యులనూ, నా శ్రేయోభిలాషులందరినీ అప్పుడప్పుడు పలకరించినవే. అయినా ఒక ఈ-పుస్తకరూపంలో ఈ ఆగష్టు 15న మీ అందరినీ మరో మారు పలుకరిస్తున్న ఈ సుద్దులను ఆదరిస్తారని కోరుకుంటున్నాను.

సహృదయవిధేయుడు,
**రాణి సదాశివ మూర్తి**


राष्ट्रियसंस्कृतविश्वविद्यालयः
(केन्द्रीयविश्वविद्यालयः)
तिरुपतिः – ५१७ ५०७.
NATIONAL SANSKRIT UNIVERSITY
(Erstwhile Rashtriya Sanskrit Vidyapeetha)
(A Central University established by an Act of Parliament)
Tirupati - 517 507. (A.P.)
Re-Accredited by the NAAC at 'A' Grade with 3.71 CGPA out of 4 point Scale
Recognized by the UGC at the Centre of Excellence in the Subject of Traditional Shastras
0877-2286799
0877-2287809
registrar_rsvp@yahoo.co.
Prof G.S.R. Krishna Murty
REGISTRAR i/c

# అభినందన చందనం

విలక్షణ ప్రతిభా సంపన్నులు ఆచార్య రాణి సదాశివమూర్తి గారు. వీరు సంస్కృతాంధ్రాలలోనే కాక పాశ్చాత్య కవితారీతులలో అందెవేసిన హస్తలాఘవం కలవారు. వీరి కవితా విమర్శలు బుధజన మాన్యమైనది. వీరి కలం నుంచి సహస్రాధిక కవితలు, శతాధిక కృతులు జాలువారాయి. ప్రస్తుత కృతి రాసమూర్తి సుద్దులు వారు పంపగా ఆమూల చూడం పరికించాను. “రాసమూర్తి సుద్దులు” అని ఈ గ్రంధరాజం యొక్క పేరే నామవక్రతను సూచిస్తుంది. రాణి సదాశివమూర్తి వ్రాసిన సుద్దులు. రాసమూర్తి అందే రాణి సదాశివ అనే పదాలలో మొదటి అక్షరాలను తీసుకొని మూర్తి అనే పదంతో కలిపి రాసమూర్తి సుద్దులు అనే ఈ కూర్పు చాలా అద్భుతం. ఇటీవలే జన్మాష్టమి పండుగ జరుపుకున్నాం. రాసమూర్తి అంటే రాసేశ్వరుడయిన కృష్ణుని కూడా తలపింపచేస్తుంది. ఇది సమసామయికం కూడా. “సుద్దు” అంటే హృదయరంజకమైన సుభాషితం అని అర్థం.

తెలుగు సాహిత్యంలో సుద్దులకు మంచి ప్రచారం వచ్చింది. గొల్లసుద్దులు మొదలయినవి నేటికి కూడా మనవారు ఆబాలగోపాలం పాడుకుంటూ ఉంటారు. సుద్దులలో చిన్న చిన్న పదాలతో ఎంతో లోతైన తాత్త్విక విచారం బట్టబయలు అవుతుంది.

రాసమూర్తి సుద్దులలో కనిపించే భావ గాంభీర్యం అనన్య సాధారణమయింది. ఒక రచయితకు చక్కని గ్రంధ పాండిత్యం, తాత్త్విక చింతనం. లోకానుభవం చాలా అవసరం. అవి సమపాళ్లలో ఉంటే ఆ కవిత్వం అజరామరం అవుతుంది. రాసమూర్తి సుద్దులలో ఈ మూడు సమతూకంలో ఉన్నాయి. వారు కవితలను వారి ద్వారా వీనులవిందుగా విన్నాను. వారిచ్చిన కృతులను కనులారా చూడముచ్చటగా ఆస్వాదించాను. ఈ సుద్దులలో వారి హృదయం ఆవిష్కృతమయింది.

చక్కటి భావం, ఆ భావాలను వాక్యాలలో పొందుపరచటం, ఆ వాక్యాలను పదాలలో ఇమడ్చటం ఆ పదాలను అక్షరాలో కూర్చడం. ఇవి అలవోకగా ఇక్కడ కూర్చబడ్డాయి. ఇటువంటి కృతులు ఇతోధికంగా శ్రీ మూర్తి గారి కలం నుంచి వెలువడగలవని నా ప్రగాఢ విశ్వాసం.

ఆచార్య రాణి సదాశివమూర్తి గారు నిత్యకృషీవలురు. వారు రోజుకు 30 గంటలకు పైగా వ్రాయగల సమర్థులు. వీరు కలం పట్టిన హలధారులు. సుధీజన పాఠక హృదయకేదారాలలో చక్కటి అమృతఝరులను కురిపించి సత్సూక్తి బీజాలను నాటి పంట పండించి అందించే అన్నదాతలు.

వారిని మనసారా అభినందిస్తున్నాను. ఈ కృతి పాఠకలోకానికి ఆనందదాయకం కావాలని ఆ శేషాచలనాథుని ప్రార్థిస్తూ 74 వ స్వతంత్ర దినోత్సవ శుభాకాంక్షలను అందజేస్తున్నాను.

తిరుపతి
15.08.2020

సుజనబుధజన విధేయుడు

**ఆచార్య గుళ్ళపల్లి శ్రీరామ కృష్ణమూర్తి**

# ప్రత్యేక కృతజ్ఞతలు

ఈ నూరు సుద్దులు అక్షర రూపాన్ని దాల్చడానికి
కారణం

సరసతకు,
నవ్యతకు,
సాహితీ మధురతకు,
విమర్శలో చతురతకు మూర్తీభూతులైన
సత్సాహిత్యవేత్త ,
★సాహితీ సిరికోన★
సమూహసంచాలకులు,
రచనావని మార్గదర్శి
**ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ వర్యులు.**
వారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు.

# రాసమూర్తి సుద్దులు

## 1. ఆత్మబోధ

అద్దం ముందు నిలబడి ఆర్తితో వెదికితే
నీ తనువులో అణువణువులో
సౌందర్యం కనబడుతుంది.
అంతే ఆర్తితో
ప్రకృతి అనే అద్దం ముందు నిలబడి వెదికితే
ప్రకృతిలోనూ, నీలోనూ అణువణువులో
సాక్షాత్కరిస్తుంది భగవత్సౌందర్యం.
ఇదే ఆత్మబోధ.

## 2. పోటీ

పరుగు పందెంలో గెలవాలంటే
నీ తోటి పోటీదారుతో పోటీ పడకు
చేరాల్సిన లక్ష్యమెరిగి నీతో నువ్వు పోటీ పడు.

మహాకవివి కావాలంటే
నీ తోటి కవులతో పోటీ పడకు
వ్రాయాల్సిన కావ్యతత్త్వమెరిగి నీతో నువ్వు
పోటీ పడు

## 3. మట్టి - చెట్టు - ప్రేమ

మట్టి
వృక్షమా! నువ్వు నాలో వేళ్ళూనుకో
నేను నీ బలాన్నవుతా
నిండు నూరేళ్ళు నిన్ను పచ్చగా ఉంచుతా.
నీవు నాకందించిన నీ సంతానాన్ని పెంచి
నిన్నో వనాన్ని చేస్తా.

చెట్టు
ఓ మృత్తికా! నేను ఎంత ఎదిగినా
నిన్నంటిపెట్టుకునే ఉంటా.
నా నీడతో నీ తాపాన్ని తగ్గిస్తా.
నా పచ్చదనంతో నీ అందాన్ని పెంచుతా.
నేనంతమైతే నీలో కలిసిపోతా!!



## 4. ఆడవారు మీరు ... మరి మేము....

ఆడవారు మీరు
మా శైశవంలో
మీఒడిలో ఆటాడువారము మేము

ఆడవారు మీరు
యౌవనం లో
మీకోసం తారాడువారము మేము

ఆడవారు మీరు
దాంపత్యం లో
మీతో పోట్లాడువారము మేము

ఆడవారు మీరు
వృద్ధాప్యం లో
మీరు చెప్పినట్లాడువారము మేము

## 5. దీపావళి

★తేజరిల్లే జ్ఞాన ప్రసూనం>సత్యం>తల్లి>–
సత్యభామ★

★వెల్లువల్లే తల్లిని మ్రింగే  ప్రసూతి>
నరకుడు> అసత్యపు చీకటి కొొదమ★

సత్యజ్ఞాన కిరణాల అజ్ఞానతిమిరసంతతిని
హరించడమే దీపావళి

ఇదే ★తమసో మా జ్యోతిర్గమయ★

## 6. కిడ్నీలు - ఉదరం

అతిగా మధురాలను
ఆశించిన ★కిడ్నీలు★
దుర్బలమైన ఆహారం
తీసుకున్న ★ఉదరం★
ఎక్కువ వకాలం
మనినట్లు (వైద్య)
చరిత్రలో లేదు



## 7. బిడ్డ - తల్లి

అడగనిది బిడ్డా కాదు.

పెట్టనిది అమ్మా కాదు.

## 8. బిడ్డ - తల్లి

మనిషైనా... మానైనా
బిడ్డ బిడ్డే
అమ్మైనా ... అమ్మలగన్న అమ్మైనా
అమ్మ అమ్మే

**9. బిడ్డ - తల్లి**

గొంతు పెగలని నోరు దాటని
బిడ్డది అడగలేని నిస్త్రాణం
ఊతం ఇచ్చినా బిడ్డ అందుకోవడం లేదని
అమ్మది తపించి విలపించే ప్రాణం

## 10. బిడ్డ - తల్లి

బిడ్డను బట్టి తల్లి – మర్కటకిశోరన్యాయం
తల్లిని బట్టి బిడ్డ – మార్జారకిశోరన్యాయం

## 11. ప్రకృతి గెలుపు - కాలం పిలుపు

కాలం తోపోటీపడి పరుగెత్తి
కాలాన్ని అంతుతెలియని చీకట్లోకెత్తి
కొండకొననందుకోగానే
ప్రకృతి గెలిచిన బంగారు పతకం నెలరాజు

రాత్రంతా దారి వెతుక్కుంటూ
ఆ పుట్టా ఈ గుట్టా చెప్పినమాట వింటూ
ఇంటికి చేరగానే
నువ్వు మళ్ళీ గెలిచావని పలుకరించే
దినరాజు
ప్రకృతి నవ్వి ఒళ్ళు విరుకునేలోపు
పందానికి కాలుదువ్వి కవ్వించే కాలం.

## 12 జ్ఞానమాధుర్యం

తెలిసిందనుకున్నవానికి ఏమాత్రం తెలియనిది
మౌనంగా  ఆచరించడం ద్వారా అనుభవం
లోకి వచ్చేది
తేనెలోని మాధుర్యం లా మాటలకందనిది
★జ్ఞానం★

## 13 నా గోడు

★నా★ గోడు వినే వాళ్ళు కావలెను
గోడు చెప్పుకునే వాళ్ళు మాత్రం వద్దు
బాబోయ్



## 14 కైతల ఉయ్యాల

కైతలల్లే వేళ
ఊహల ఉయ్యాల
కమ్మని భావాల
మనసుకు జంపాల



**15 ఎల్లా ఎల్లా**

ఎల్లా వచ్చామో తెలియదు
ఎల్లా పోతామో తెలియదు
ఎల్లవేళలా ఇలాగే ఉండగలమా? తెలియదు.
పిల్లా జెల్లలతో ప్రపంచాన్ని పెంచేసి
అల్లానే ఉండాలి
ఇల్లానే ఉండాలి అంతా అంటే
ఎల్లా? ఎల్లా?

## 16 శ్వాస-శాసనం

శ్వాసించడానికి దిక్కులేదు
శాసనాలకు తక్కువ లేదు

## 17 పొగడ్త ఒక అగడ్త

మనిషి ఈ ఒడ్డున
ఆనందం ఆవలి ఒడ్డున
మధ్యలో
పొగడ్త ఒక అగడ్త

## 18 ప్రకృతివిలాపం

వేసవిలో చల్ల దనాన్ని
శీతవేళ వెచ్చదనాన్ని
వానలో గొడుగు నీడను
కోరుకునే ఈ మనిషి
నాకెప్పుడు చేరువయ్యేను?
అన్న ప్రకృతి విలాపమే ఈ తుఫాను

## 19 తలవొంచు తప్పించుకో

కంటి ముందున్నది
కనబడకుండా పోతున్నది
కనబడకుండా ఉన్నది
కల్లోలవేల్లితం చేస్తున్నది
తల వంచు తప్పుకుని వెళ్ళి పోతుంది
తలెత్తేవో ఏం తలెత్తుతుందో?

## 20 జీవితంలో పాట్లు

అమ్మ కడుపులోంచి ఊడిపడ్డాడు
అమ్మ పొత్తిలి నుండి ఊయలలో పడ్డాడు
తొలి అడుగు వేసి విజయమోహంలో పడ్డాడు
అక్కడ నుండి సంసారపు ఊబిలో పడ్డాడు.
వేసే ప్రతి అడుగు కూరుకు పోయి
చతికిలపడ్డాడు
ముదిమికర్ర ఊతంతో ఆశావలయంలో
పడ్డాడు
నిజం తెలుసుకునే లోపు కాలం జీర్ణకోశంలో
పడ్డాడు.

## 21 వింత-చింత-బొంత

శిశువుకు వింత
యువతకు చింత
ముసలికి బొంత
జీవితమంతా.



## 22 భూతం పట్టు

ట్రెడ్మిల్ పై ఆగని డ్రిల్ జీవిత మన్నది
మనం వేసే ప్రతి అడుగులో
ఎంతో విలువైన వర్తమానాన్ని
వెనక్కి నెట్టేస్తున్నాం.
వెనుతిరుగనివ్వని భూతం
ఒడిసిపట్టుకుని మింగేస్తోంది.

## 23 ముందు చూపు

ముందు చూపు లేని వాడు
తన గతాన్ని పొగుడుకుంటాడు

**24 మరోసారి పొగిడించుకోవాలంటే...**

రెండవ సారి పొగిడించుకోవాలనుకునేవాడు తనకు వచ్చిన తొలి పొగడ్తలకు తాను తగనంటాడు



## 25 పరనింద

పరనింద

ఆత్మన్యూనతా భావాల గుట్ట

## 26 నేడు - నిన్న- రేపు

ఎప్పుడూ ఆగకుండా పనిచేసేవాడికి
కాలం ఒకటే ప్రవాహం వర్తమానం
నిన్న సాధించలేని వాడికి
రేపటి విలువ బాగా తెలుస్తుంది.
నిరాశావాదికి మిగిలేది నిన్న మాత్రమే

**27 అనారోగ్యం- ఆరోగ్యం**

ఇతరుల గుణ ప్రశంస చేయకపోవడం అనారోగ్యం

ఉత్తుత్తి పొగడ్తలు చేయకపోవడం ఆరోగ్యం



## 28 హననం - సంయమనం

తనను తాను పొగడుకోవడం ఆత్మ హననం

పొగడ్తలకు అతిగా పొంగకపోవడం

సంయమనం

## 29 ఆవేశం - ఆక్రోశం

తను నిన్న చేయలేని దాన్ని ఈరోజు
చేయాలనుకోవడం
ఆవేశం. అది అవసరం.
తను చేయలేని దాన్ని పక్కవాడు చేస్తే
తట్టుకోలేక పోవడం
ఆక్రోశం. అది సలపరం.

## 30 తిట్టడం

పొద్దస్తమానం పక్కవాణ్ణి తిడుతూ
కూర్చోవడం
చీకట్లో కూర్చుని వెలుతురును తిట్టడమే.



## 31 గుణవత్త - సత్తా

మంచి గుణాలు కలిగి ఉండడం గుణవత్తా
ఆచరించి చూపించు. అది నీ సత్తా.

## 32 కృష్ణబిలాలు

ఈ అనంతవిశ్వంలో
అంతుచిక్కనివి
దిక్కాలాతీతములైనవి
కాంతి కిరణాలను చొరనీయనివి
అసంఖ్యాక లోకాలను కూడా
మ్రింగి వేసేవి
★కృష్ణబిలాలు★

విశ్వప్రతీక మనశరీరమూ అనంతమే
ఈ శరీరం లోనూ
దిక్కాలాతీములు
జ్ఞాన కాంతి గ్రాసములు
కబళితానంతభావలోకాలోకములు
అయిన కృష్ణబిలాలెన్నో! ఎన్నెన్నో!?

## 33 ముచ్చట

నా జీవితం మూడునాళ్ళ ముచ్చట
నిన్న, నేడు, రేపు.

**34 "అ" నాది**

తెలుసనుకున్న ఈజగత్తులో
ఎంత తెలుసుకున్నా
తెలియనిరానివెన్నో!
తెలిసినదానిలోనూ
తెలియనవెన్నెన్నో
అందుకే ఈ భ్రాంతిమయ జగత్తులో
అజ్ఞానం నిత్య సత్యం
నేను అసత్యం
నాది “అ” నాది



## 35 తప్పు చేయని వాడు

ప్రపంచంలో అవకాశం రాని వాడు
మాత్రమే
తప్పు చేయని వాడు

## 36 చెవిపోటు

చెప్పే ప్రతీవాడికీ ఒక వినేవాడు కావాలి
అయితే లోకంలో
తొంభై తొమ్మిది మంది చెప్పేవాళ్ళు
ఒక్కడు వినేవాడు
అందుకే  చెవిపోటు పెరిగింది



## 37 కాలం - నువ్వు

కాలాన్ని చూడాలనుకుంటున్నావా?
నిన్ను నువ్వు అద్దంలో చూసుకో!

## 38 కాలరూపాలు

పసితనపు అమాయకత్వం లో
బాల్యపు చిలిపి చేష్టలలో
యౌవనపు శక్తియుక్తులలో
వృద్ధాప్యపు పరిణతిలో
ఇలా
మనిషి ఎదుగుదలలో కనబడేది ★కాలం★

**39 కర్మ**

పులి లా తరుముతూ

మనిషిని పరిగెత్తించేదే ★కర్మ★

## 40 నీ విలువ

నువ్వు పుట్టనే పుట్టని జగత్తును ఊహించుకో
నీ విలువేమిటో నీకు తెలుస్తుంది.

**41 శిక్షించేదెవ్వరు?**

లేని వస్తువుపై కోరికే ఉండదు

లేని పనికి ఫలమే ఉండదు

కాని చేయని విధికి  మాత్రం శిక్ష ఉంటుంది.

ఎవరు శిక్షించకపోయినా కాలం శిక్షిస్తుంది

## 42 విశ్వమంతా ఇల్లే

కప్పకి తన బావిని మించిన లోకంలేదు.
వెంకప్పకి విశ్వమంతా ఇల్లే.

**43 మాట - బాట**

వాదబలం లేని వాడు
వాదిబలం చూపుతాడు
మాట నెగ్గలేని వాడు
తన మాటే బాటంటాడు.

## 44 పరమార్థం

పదే పదే చెబుతుంటే
పరమార్థం అయిపోతుందా?
కాదని పదిమార్లంటే
పరమార్థం మారిపోతుందా?

## 45 బ్రతుకుపోరాటం

అసంఖ్యాక జీవరాశులలో
మనిషి ఒక్కడికే బ్రతుకు పోరాటమా?
పుట్టిన ప్రతి జీవికీ బ్రతుకు పోరాటమే

**46 సంస్కృతి - అయోమయస్థితి**

తను బ్రతికి ఇతరలను బ్రతికించడమే
సంస్కృతి
అలా బ్రతకడం నేర్పేదే సాహిత్యం.
బ్రతకడం నేర్చుకోక తననెవరో
బ్రతకనివ్వటం
లేదనడం అమాయక అయోమయస్థితి

## 47 నింగి - నేల

బ్రతకడానికి ఆకాశం హద్దు
బ్రతికించడం నేలతల్లికి ముద్దు
ఆకాశం వరకూ ఎదగాలి.
నేల తల్లిని నమ్మాలి.

## 48 ఊరు - ఊబి

చెట్టుని, మట్టిని, ఏటిగట్టుని
రక్షించు. అది నీ ఊరౌతుంది.
చెట్టుని నఱికి మట్టిపై బండల్ని పరిచి
ఏటిలో ఇల్లుకడితే అది నీకు ఊబి
అవుతుంది.

## 49 చెప్పకు - మరువకు

నువ్వు చెప్పుకోవాల్సింది నీ గతం కాదు
నువ్వు మర్చిపోవాల్సింది నీ పూర్వీకులను కాదు

## 50 ఇదేమిటి నేస్తం?

నువ్వు తినే ధాన్యం నువ్వు కొంటే
ఒక రైతు శ్రమను నువ్వు దోచుకున్నట్టుకాదా
నేస్తం!
నువ్వు కట్టే బట్టను నువ్వు కొంటే
ఆ బట్టను ఉత్పత్తి చేసిన వారిశ్రమను నువ్వు
దోచుకున్నట్టుకాదా నేస్తం!
నువ్వు ఉండే ఇల్లు కట్టించడానికి నువ్వు ఇచ్చే
దినసరి వేతనం
ఆ ఇల్లు కట్టడంలో సహకరించిన శ్రామికుల
శ్రమను దోచుకోవడం కాదా నేస్తం?
నువ్వు ఇచ్చిన సొమ్ము వారికి ఒకరోజు తిండి
కాని వారు కట్టిన నీఇల్లు నీ బ్రతుకు గూడు
బండి
ఒక వేళ నువ్వు అద్దె ఇంట్లో ఉంటుంటే
నువ్వు
జీవితం అంతా చెమటోడ్చి ఆ ఇల్లు
కట్టుకున్న వాడినీ,
ఆ ఇల్లు కట్టిన శ్రామికులను ఇద్దరినీ
దోచుకుంటున్నావు కదా నేస్తం!?!
తాజ్మహల్ నిర్మాణానికి రాళ్ళెత్తిన వారే కాదు
నేస్తం
నీ ఇంటికి రాళ్ళెత్తిన వారూ దోపిడీకి
గురైనవారే కదా నేస్తం

## 50 ఇదేమిటి నేస్తం?



## 51 మహానుభూతి

కాలాన్ని పెట్టుబడిగా పెట్టి
అనుభవాలను కొనుక్కోకండి
కాలాన్ని అనుభవించండి
కాలమే ఒకమహానుభూతి కావాలి



## 52 కవితావస్తువుల ఎగతాళి

కవిత్వం వ్రాద్దామనుకుంటే
కరోనాతో సహా కవితా వస్తువులన్నీ
కడుపెగరేసుకుంటూ నవ్వుతున్నాయి.
నీకేం మిగిలిందోయ్ వ్రాయటానికి అని.

## 53 కలవరపడుతున్న కళ

కళనాస్వాదిద్దామనుకుంటే
కళాకారులే కనబడటం లేదు.
కరాళకాలవిన్యాసాల
అంతర్జాలేంద్రజాలవిలాసాలు తప్ప



## 54 వస్త్రాచ్ఛన్నవదనలు

కావ్యనాయికాధరాల వర్ణనకు
ఆలంబన కావాలి అని లోకం లోకి తొంగి
చూసిన కవికి
కట్టుకున్న భార్యామణితో సహా
కాంతలందరూ వస్త్రాచ్ఛన్న వదనలే
కనిపిస్తున్నారు.

## 55 పొరుగింటి వాడు

వంచిన తలెత్తకుండా
భావనా ప్రపంచంలో మునిగి పోయేవాడు
కవి
కవి చెప్పిందల్లా బాగుంది బాగుందంటూ
ఆపకుండా తలూపేవాడు భావుకవిమర్శకుడు
వీళ్ళిద్దర్నీ చూసి తలతిప్పి దూరం నుంచే
పారిపోయేవాడు
పొరుగింటి వాడు

## 56 పదిలో పదిలం

పదిమంది చేత పదికాలాలపాటు
పదే పదే పొగిడించుకునేందుకు
పదిలమైన శరీరం కావాలని
పది పదుల వత్సరాలుండాల్సిన ఈ శరీరాన్ని
ఆరేడు
పదులకే పైకి పంపి సంపాదించుకున్న
ఆయాసమే కీర్తి.

## 57 నల్లదనం విలువ

నల్లని బొగ్గు లోంచి మెరిసే వజ్రం
పుడుతుంది
నల్లని రాత్రి కడుపులోంచి దినమణి
పుడుతోంది.
నల్లగా మారిన తనువు నుండే  తెల్లని కీర్తి
పుడుతోంది. కానీ
నల్లధనానికి విలువనిచ్చే లోకం నల్లదనానికి
విలువనివ్వదు.

## 58 ఏకముఖి

దీపం సర్వతో ముఖంగా వెలుగునిస్తుంది.
రత్నం సర్వతో ముఖంగా ప్రకాశిస్తుంది.
పుష్పం సర్వతో ముఖంగా పరిమళాలను
వెదజల్లుతుంది.
మనిషి కూడా సర్వతోముఖంగా వికసించాలి.
కాని లోకానికి ఒకముఖమే చూపిస్తున్నాడు.



## 59 దేవుడికి నా వినతి

ఓ భగవంతుడా! నీకు తెలుసు
నువ్వు పుట్టించిన నేను ఎన్ని పనులతో
సతమతమౌతున్నానో.. కనుక
నేను నిన్ను మర్చిపోయినా
నువ్వు నన్ను సాకడం మరువకు.

## 60 ఇది ప్రతిఫలం

శ్రమ ఏ ఒక్క జీవికో పరిమితం కాదు
లోకం లో శరీరమున్న ప్రతి జీవికీ శ్రమిస్తేనే
అస్తిత్వం.
కొందరు శారీరకంగా శ్రమిస్తారు.
కొందరు బౌద్ధికంగా శ్రమిస్తారు.
ప్రతిఫలం రూకలో నూకలో కాదు.
సంతృప్తికరమైన జీవితం ప్రతిఫలం కావాలి

## 61 "డే"ల "మేలా"

ఒకే రోజు ఇన్ని "డే" లా?
ఎలా జరుపుకోవాలో తెలియక డీలా
ఇది ఒక "డీలా?"
చేసెయ్ దీన్నొక కవితల "మేలా"

| Date | Federal holiday | Day of the week |
|---|---|---|
| January 1, 2025 | New Year's Day | Wednesday |
| January 20, 2025 | Martin Luther King Day | Monday |
| February 17, 2025 | Presidents' Day | Monday |
| May 26, 2025 | Memorial Day | Monday |
| July 4, 2025 | Independence Day | Friday |
| September 1, 2025 | Labor Day | Monday |
| October 13, 2025 | Columbus Day | Monday |
| November 11, 2025 | Veterans Day | Tuesday |
| November 27, 2025 | Thanksgiving Day | Thursday |
| December 25, 2025 | Christmas Day | Thursday |

## 62 నాన్న పై కవిత

అది సరే ...

నాన్న గురించి కవిత వ్రాయాలంటే

పుత్రుడు రాస్తే ★చిత్రకవిత★

పుత్రిక రాస్తే ★మిత్రకవిత★

అమ్మ రాస్తే ★అధి వాస్తవికత★

నాన్న తనే రాసుకుంటే ★అది వాస్తవికత★

## 63 సంగీతం

సమ్

సంగీ

సంగీతం

గీతం

తమ్

ప్రత్యక్షరమాధుర్యం

## 64 యోగ

★ఆసనాలు వేసే నన్ను చూసి”

ప్ర – నువ్వు ★యోగా?★ –

జ – కాదు ఇది ★యోగా★

ప్ర – ★యోగ★ కదా!?

జ – ఆసనాలను సాగదీసి ఊపిరి ఎగదోస్తే

★యోగా★

## 65 కోవిద్

సతమౌతున్నారు కోవిదులిలా.
ఇదంతా "కోవిద్" లీల.

## 66 స్నేహబంధం

స్నేహబంధం
(మరణశయ్య మీదున్న మిత్రునితో)
"ఏమిట్రా నీకీ కష్టం? నీబదులు నన్ను
తీసుకెళ్ళినా బాగుండేది ఆ దేవుడు"
సమాధానం –
"నేపోతున్నందుకు బాధగాలేదురా! మళ్ళీ
ఎన్ని జన్మలకు
మనం స్నేహితులు గా పుడతామో? అనే
బాధ.

## 67 మరణభయం

మరణభయం
రోజూ పలురూపాల్లో లోకాన్ని
పలుకరించి వెళ్ళి పోతున్న
మృత్యువు వాయువులా సంచరిస్తున్నా
పెరిగే వయసులో నాకు మృత్యువు భీతి
నాలో పెరుగుతూనే ఉన్న
అహంకారంలో లవలేశం కూడా లేదు.

## 68 విశ్వసంసారం

భార్యాభర్తల సమాంతరభావయోగం
వ్యష్టి సంసారం
పురుషప్రకృతుల సమాంతరసహయోగమే
విశ్వసంసారం

**69 విశ్వం - క్షేత్రం**

సూర్యుడు ప్రకాశపుంజమే
ప్రతిఫలించడానికి విశ్వం కావాలి
బీజమనంతవృక్షమూలమే
వృక్షమై ఫలించడానికి క్షేత్రం కావాలి

## 70 పాత్ర-రసం

పాలుండేది పాత్రలోనే.
కానీ పాలను పాత్రతాగదు.
పాలరుచి తెలిసినవారు త్రాగుతారు
అలాగే కావ్యంలో
రసముండేది పాత్రలోనే.
కానీ ఆ రసాన్ని పాత్ర ఆస్వాదించదు.
రసజ్ఞులు ఆస్వాదిస్తారు.

**71 అద్దం - ప్రతిబింబం**

పైన సూర్యుడు
క్రింద నొక నూరు అద్దాలు
అద్దాలలోని ప్రతిబింబాలు తామే
నిజమైనసూర్యులమనుకుని
మిడిసిపడుతూ మిలమిలా మెరుస్తుంటాయి
అద్దం పగిలిపోతే ప్రతిబింబం మిగిలేనా?

## 72 యాగం – ఆగం

మింటిలోనూ మేఘాలున్నాయి.
కంటిలోనూ మేఘాలున్నాయి.
యాగం చేస్తే మిన్ను వర్షిస్తుంది
ఆగం చేస్తే కన్ను వర్షిస్తుంది.



**73 ఈ జగత్తు నీదే**

అహం కారం అంటే ★నేను★

మమ కారం అంటే ★నాది★

వీటిలోంచి పుట్టిందే జగత్తు.

కనుక జగత్తు అంతా నీసృష్టే.

## 74 దిక్కులు - కాలాలు

నాలుగు దిక్కులు, మూడు కాలాలు
ఏర్పరచుకున్న ది నువ్వే.
విశ్వం లోకి వెడితే ఇవేమీ లేవు.
ఈ లెక్కలు నీవే.



## 75 ఆత్మీయత

ఆత్మీయత అంటే ★నాది★ అనే భావన.
ఆత్మీయత ఉన్న చోట
వ్యవహరించే తీరు, శ్రద్ధ,
తలపు, పిలుపు మారతాయి.
సంశయం ఉండదు.
కనుక నీదైన వస్తువులలో
జగత్తు కంటే పెద్ద వస్తువు లేదు.

## 76 బ్రహ్మ - పరబ్రహ్మ

నాలుగు దిక్కులు ఏర్పరచుకుని
నాలుగు ముఖాలను ధరించి
ఈ జగత్తు కల్పనకై బ్రహ్మవౌతావో
ఈ జగత్తు జంజాటం
వదిలించుకుని పరబ్రహ్మమౌతావో
నిర్ణయం నీదే.

**77 విష్ణువు - పరమాత్మ**

నాలుగు చేతులు పెంచుకుని
నీ జగత్తు ను  కాపాడుకునే
విష్ణువు అవుతావో
నాలుగు చేతులా అందరికీ పంచేసి
నిర్వికారంగా పరమాత్మవౌతావో
నిర్ణయం నీదే.

## 78 పరమపురుషుడు

సంసారసాగర గరాన్ని
కంఠంలో దాచుకుని నీలకంఠుడివి
అవుతావో
లయవిలయాతీతుడవై
పరమపురుషుడవౌతావో
నిర్ణయం నీదే

## 79 పశువు - పాశం - పశుపతి

నీవు బుద్ధి జీవివి
పశువుగా రగులుతావో
పాశమై తగులుతావో
పశుపతివై మిగులుతావో
నిర్ణయం నీదే

## 80 మహామాయ

సుఖం ఒక పాయ
లోకం లో ఆయాసపు పరుగు ఒక పాయ
దుఃఖం ఒక పాయ
మూడు కలిపి పేనిన తాడే మహామాయ

## 81 కొలబద్ద

సెలవు రోజు
మన బద్ధకాన్ని నిరూపించుకోవడానికి
మరొక కొలబద్ద



## 82 మరో పేరు

సమయం లేదు అనడం
మన బద్ధకానికి మారు పేరు

## 83 కంబళీ

బద్ధకం
మనలోని బలహీనతలను
కప్పుకునేందుకు చలికాలపు కంబళీ

**84 దృక్కు - ద్రష్ట - దృశ్యం**

★నిన్న★ ను నువు కన్ను వై చూడు

★నేటి★ లో నిన్ను చూసుకో

★రేపటి★ కి నువ్వు కనబడు

అపుడు నువ్వే దృక్కువు

నువ్వే ద్రష్టవు

నువ్వే దృశ్యానివి కాగలవు



## 85 అద్భుతమూ భూతమే

భూతం (గతం) కానిది
అద్భుతమని
వేదం ఇచ్చిన నిర్వచనం
★(యదభూతం తదద్భుతమ్)★ అని.
కాని నేటి అద్భుతం రేపటికి భూతమే.
ఇది అనుభవం.

**86 ధర్మపత్ని - ఊహాసుందరి**

రేపటి కోసం
నేటిని వదిలి వేయడమంటే
ఎదుటనున్న ధర్మపత్నిని వదిలి
ఊహాసుందరిని పెనవేసుకోవడమే.

## 87 నీలో పెద్దదొంగ

నీ కాలాన్ని దోచుకునే పెద్ద దొంగ
నీలోని బద్ధకం



## 88 తివాచీ

అంగట్లో తివాచీ రేపు
పరచిన తివాచీ నేడు
మాయా తివాచీ నిన్న

## 89 అబద్ధం - బద్ధకం

అబద్ధం అనారోగ్యం
బద్ధకం ఆత్మహత్య

## 90 చీకటి నది

★కాలం★

లోతు తెలియని

ఒడ్డు లేని

తెల్లని చీకటి నది

**91 భూ వనాలు - భువనాలు**

ప్రాచీధరణీగర్భం నుండి
ప్రవాళనిభ సూర్యప్రసవం
ప్రాచీనార్ణావని నుండి
మరాళనిభ సత్యప్రసవం
ఒకటి భూ వనాలకు వెలుగు
ఒకటి భువనాలకు వెలుగు

**92 సాహిత్యం సౌహిత్యం**

సన్నిహితం సాహిత్యం
సుహితం సహితం రససహితం
మహితం సౌహిత్యదాయకం.



## 93 నీ శైలి నీదే

భేతాళ కథలు వ్రాసే వాడు
కథలంటే తనలాగే వ్రాయాలంటాడు
కాశీ మజిలీ కథలు వ్రాసే వాడు
కథలంటే తనలాగే వ్రాయాలంటాడు
కంప్యూటర్ కథలు వ్రాసేవాడు
కథలంటే తనవేనంటాడు.
నన్నడిగితే..
నీదగ్గర ఉన్న బంగారాన్ని బట్టి నీ నగలు
నీ ఆలోచనలను బట్టి నీ కథలు
ఎవ్వరిమాటవినొద్దంటాను.

## 94 రవళి - శైలి

మువ్వ మువ్వదొక రవళి
మనిషి మనిషి దొక శైలి

## 95 కథ - వ్యథ

కథ ఆద్యంతం మోదాన్నైనా కలిగించాలి
లేక ఒక వ్యథకు తుదనైనా చూపించాలి



## 96 నాలుగు ఈగలు

స్వానుభవ కథకుడు కందిరీగ
పరానుభవ కథకుడు తేనెటీగ
కాల్పనిక కథకుడు జోరీగ
లక్ష్యం లేని కథకుడు గుడ్డి ఈగ



## 97 ఇతివృత్తం - వర్ణన

కథలో

ఇతివృత్తం చుట్టూ ఉన్న వర్ణనలు

పెళ్ళికూతురి మేలిముసుగులా ఉండాలి

కాని దొంగోడి కంబళీలా ఉండకూడదు

## 98 సాహిత్యం అంటే

చదవాల్సినవి కొన్ని
చదివించేవికొన్ని
చదవనివ్వనివి కొన్ని
చదవలేనివి కొన్ని
చదవనివి కొన్ని
సాహిత్యం అంటే ఇవన్నీ

## 99 ప్రవాహం

కవి  ఈ ఒడ్డు – పాఠకుడు ఆ ఒడ్డు
మధ్యలో రచన ఒక ప్రవాహం

## 100 మందు - విందు

నూరగా నూరగా మందు
కవితలు నూరైతే విందు

## 101

“నిర్” వచనాలు

The Definitions

★జీవితం★ ఆంబోతులా రంకెలేసే గానుగెద్దు

Life is an oil-mill-ox braying like a bull.

★కాలం★ మేకవన్నెపులి

Time is the tiger in goat’s skin.

★భూమి★ పసిరిక కప్పిన పాతాళం

The Earth is the Abyss enveloped under green grass.

★బాల్యం★ చిగుళ్లు తొడిగే అహంకారం

Childhood is sprouting ego.

★యౌవనం★ వేళ్ళూనుకున్న మమకారం

Youth is deep rooted possessiveness.

★నడిమి వయస్సు★ కర్తవ్యాల కారాగారం

Midlife is the prison of duties.

★ముసలితనం★ గతాల చిట్టా. నిట్టూర్పుల పుట్ట

Oldage is the grand list of yesteryears' deeds and of the heap of long sighs.

★ఆశయం★ ఆశల హరివిల్లు

Ambition is the Rainbow of hopes.

★కీర్తి★ కాలం తుడిచేసే రంగవల్లి

Fame is the Rangoli being wiped off by Time.

★ప్రణయం★ ప్రణవమని భ్రమింపచేసే ప్రళయం

Love looks like the holy syllable *om* but ends in dissolution.

## స్వ 'గతం'

**పేరు** : రాణి సదాశివమూర్తి

**జననీజనకులు** : డా. రాణి శ్రీనివాస శాస్త్రి, శ్రీమతి రాణి శ్రీదేవి
**జననతేది** : 30.11.1958
**విద్యార్హతలు** : MA(Sanskrit), Ph.D., MA (English), MA (Philosophy) Vedanta Vidyapraveena, Jyotisha Acharya, MBA, PG Diploma in German, Net (UGC), CIC (IGNOU)
**వృత్తి :** డీన్ ఎకడమిక్ ఎఫైర్స్, సాహిత్య విభాగాధిపతి, రాష్ట్రియ సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతి.

Member, Academic Advisory Council, University of Silicon Andhra, California, U.S.A.

**ప్రత్యేకవిషయాలు :**
సంస్కృత కావ్యశాస్త్రం, వైదిక ఛందశ్శాస్త్రం, తంత్రములు, వేద, వేదాంగవిజ్ఞానము, భారతీయ తత్త్వశాస్త్రం, ప్రాచీనభారతీయ విజ్ఞానం, ప్రాచీన నిర్వహణాశాస్త్ర విశేషాలు మొదలైనవి.

**బిరుదములు :**
సంస్కృత బంధు (2000సం.లో), విజయశ్రీ (2005), నాట్యరవళి స్టేట్ టాలెంట్ అవార్డ్ (2007), వ్యాసభారతి (2007), ప్రజ్ఞాభాస్కర (2010), కేంద్ర సాహిత్య అకాడెమీ అనువాద పురస్కారము (2016), కళ్యాణానందభారతి పురస్కారము (2018), వేదటెంపుల్ పురస్కారము, U.S.A. (2018).

**రచించిన గ్రంథములు :**
వదత సంస్కృతమ్, Vedic Prosody – Its Nature, Orign and Development, నవరత్నదీపిక, చాక్షుష యుగ్మం, ధ్వన్యాలోక పారభాషిక పదకోశః, ధ్వన్యాలోకకారికార్థదర్శినీ, కారికాసారశ్చ, మనోన్మనీ, అగ్నిపుత్రాః వయం భారతాః, విద్యాపీఠవైభవమార్గసూక్తయః, కాత్య, సరస్వతీ సనాతన ప్రవాహిని, సామాన్యుని మహా వాక్యాలు, Amla (A Monograph) – ఇలా నలభైకి పైగా గ్రంథములు రచింపబడినవి.

**నృత్యరూపకములు :** నాట్యావిర్భావం, రాధామాధవీయం, ఋతుసందేశం (తెలుగు), ఋతుసందేశం (సంస్కృతం), అర్ధనారీశ్వర విలాసం, గౌతమి, శాంతి శిల్పి, సరిద్వరాగం, విశ్వేశ్వరవిజయం, బుద్ధబోధామృతం, ఆంధ్రకళావిలాసం, కాటనార్య విజయం, శ్రీ రామానుజ చరితం, నవనీత గీత, అమరావతీ వైభవం, శ్రీకృష్ణవేణీ విలసనం, శ్రీపద్మావతీశ్రీనివాసం మొ.వి.

**సంపాదకునిగా :**
Glimpses of Indo – Nepal Sanskrit Conference, Work Culture And Efficiency, with Special Reference to Indriyas, Ancient Indian Science and Its Relevance to the Modern World, The Epoch of Vivekananda in the Modern Age, వాక్యార్థవైజయంతి, జగ్గువకుళభూషణకావ్యమాల, సంస్కృతవాఙ్మయే శ్రీపండితరాజ వరివస్యా, భారతీయభాషాసమ్మేళన్ నిబంధావళి మొ.వి.

**పరిశోధనావ్యాసాలు :**
వివిధ పరిశోధన పత్రికలలో ప్రచురించబడినవి, సదస్సులలో సమర్పించినవి 100 పైగా ఉన్నాయి.

**దర్శకత్వం వహించిన సంస్కృత చలన చిత్రం :** హిడింబా భీమసేనం (రాష్ట్రియ సంస్కృత విద్యాపీఠం నిర్మించింది.)

**దూరదర్శన్ మొదలైన ప్రసారమాధ్యమాలలో సేవలు :** డి.డి1, డి.డి8 లలో 30 కి పైగా ప్రసంగాలు, ఖగ్రహభువనవిజము అనే రూపకము.
శ్రీ వేంకటేశ్వరభక్తి ఛానల్లో 2008 వ సంవత్సరం నుండి అనేక తిరుమల ఉత్సవాలపై ప్రత్యక్షవ్యాఖ్యానాలు, నాలుగు సంవత్సరాలుగా శుభోదయం కార్యక్రమంలో మాసవైశిష్ట్యం, తిథివైశిష్ట్యం ప్రవచనాలు.
ఆంధ్రజ్యోతి పత్రికలో రెండుసంవత్సరాలుగా పరంజ్యోతి శీర్షికకు వ్యాసాలు.

**విజయవంతమైన ప్రాజెక్ట్స్ :**
1) Electronic Text of The Mahabharata with Hyper Links, 2008
2) Gita Govindam (Audio) etc., 2011
3) మహాభారతసంపాదకత్వం (దేవనాగరి మరియు తెలుగు లిపిలో 18 భాగములలో వ్యాసమహాభారతప్రకాశనము, తిరుమల తిరుపతి దేవస్థానముల ద్వారా. 2018 డిసెంబర్)

**పరిశోధన మార్గదర్శనం : పి.హెచ్.డిలు :** 18, యమ్. ఫిల్స్ : 22
**పోస్టు డాక్టోరల్ ఫెలోషిప్ మార్గదర్శనం :** 2 (డా.కె. సుజని, డా. సుజాత మునుకుట్ల)

**విదేశీ పర్యటనం :** సెయింట్ పీటర్స్ బర్గ్, రష్యా(2004), ఖాట్మండు, నేపాల్(2008), కాలిఫోర్నియా, అమెరికా (2018), (2019) లలో
ఇలా విద్యావ్యాసంగప్రస్థానం ముందుకు సాగుతూనే ఉంది.

**ఈమెయిల్, చరదూరవాణి :** ranisadasivamurty@gmail.com,
Ph. +919440246354